

# అధికారులు వర్సెస్ అధికార పార్టీ

**- జల జీవన్ మిషన్, నీటి సమస్యపై విస్తృత చర్చ - జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో తాగునీటిపై గళమెత్తిన ఎమ్మెల్యేలు**
**- సుంకేసుల ఎగువన రిజర్వాయర్ నిర్మాణం కోసం తీర్మానం**

**ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్**

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అధికారులు వర్సెస్ అధికార పార్టీగా ప్రశ్నల వర్షంతో కొనసాగింది. శుక్రవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ ఎరబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖలపై చర్చించారు. సుంకేసుల ఎగువన రిజర్వాయర్ నిర్మాణం కోసం తీర్మానం చేశారు. ఓర్వకల్ జడ్పిటిసి మాట్లాడుతూ రైతుకు సరిపడా విత్తనాలు అందించాలని కోరారు. ఆస్పరి జడ్పిటిసి మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు తప్పుగా వివరాలు నమోదు చేయడం 3 వేల మంది రైతులకు పరిహారం రాలేదన్నారు. రైతుల వివరాలు సక్రమంగా నమోదు చేసి అందరికీ పరిహారం అందేలా చూడాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. గడివేముల మండలం కరిమద్దెల గ్రామంలో సర్పంచ్, అక్కడ అధికారులు కౌలు రైతులుగా గుర్తింపు పొంది 13,500 రైతుల నగదు స్వాహా చేశారని వాటిని విచారణ చేసి సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆలూరు, అస్పరి, హాలహర్వి మండలాల్లో దాహం తీర్చుకోవడానికి కిలో మీటర్ల దూరం పొలాల్లో వెళ్లి తెచుకోవాల్సిన దుస్థితి ఉందని ఆలూరు ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకుని నీటిపారుదల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపే వెళ్లి అన్ని గ్రామాలు పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణాలు ఎక్కడ చేపట్టాలి అనేది పరిశీలించి నివేదిక ఇస్తే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ పరిధిలో 68 చెరువుల నింపడాన్ని గత ప్రభుత్వంలో ప్రారంభించారని, అయితే కనీసం ఎక్కడా పూర్తి కాలేదని, అన్ని పైపులు పగిలిపోయి రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ 30 చెరువులకు నీటిని అందించామన్నారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ గుండ్రేవుల, గాజులదిన్నె, ఆర్డీఎస్ కాలువ పనులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టు ఎత్తు పెంచడం వల్ల గేట్లు ఎత్తలేక నీరు వెనక్కొచ్చి రైతుల పంటలు దెబ్బతిన్నాయన్నారు. జడ్పీ ఛైర్మన్ ఎరబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ సిడబ్ల్యుసి స్కీం కింద జిల్లా పరిషత్ పరిధిలో రూ.80 కోట్ల నుండి రూ.85 కోట్లు ఖర్చు అవుతుందని, కేవలం 25 కోట్లు మాత్రమే వస్తుందని, ఈ ప్రభుత్వంలో రూ.80 కోట్ల నిధులు వచ్చేలా తీర్మానం చేసి మంత్రుల ద్వారా నివేదించాలని కోరారు. కృష్ణాబోర్డు కర్నూలులోనే పెట్టాలని ఆ తీర్మానం కూడా చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి పట్టుబట్టారు. అందరూ ఎమ్మెల్యేలు అందుకు ఏకీభవించడంతో కృష్ణా నది పరివాహక ప్రాంతం ఇక్కడే ఉందని, కృష్ణా బోర్డు కర్నూలులోనే పెట్టాలని తీర్మానం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ.జనార్ధన్‌రెడ్డి

**ఎంపీలు ఏమన్నారంటే..**

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ వెలుగోడు ప్రాజెక్టు పూర్తి అయిందని చెప్పి వెలుగోడు గ్రామానికి నీళ్లు ఇవ్వని దుస్థితి ఉందన్నారు. గత ప్రభుత్వంలో హడావిడి చేశారు తప్ప ఎక్కడా చుక్క నీటిని తాగడానికి ఇవ్వలేదని విమర్శించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎల్‌కె తండాలో పైప్‌లైన్ పోయి తాగడానికి నీళ్లు లేకుంటే కనీసం మరమ్మత్తులు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు పశ్చిమ ప్రాంతం తాగునీటికి కష్టాలు పడుతోందని, ఇన్ని నీళ్లు ఉన్నా తాగడానికి చుక్క నీరు లేకుండా ఉన్నాయని, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారుల వెంట నెల రోజులు తిరిగి ప్రజల దాహార్తి తీరుస్తానన్నారు.

**నాసిరకం పనులు : మంత్రి బీసీ**

జలజీవన్ మిషన్ పనులు ఎక్కడా పూర్తి కాలేదని, ఓట్ల కోసం, సొమ్ము చేసుకోవడం కోసం నాసిరకం పనులు చేశారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఆ పైపులు ఎక్కడ ఉన్నాయి.. ఏ నాయకుని ఇళ్లల్లో, కాంట్రాక్టర్ల ఇళ్లల్లో ఉన్నాయో ఆధారాలతో బయటపెడతామని, దీనిపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకి లైనింగ్ వర్క్ చేయడం అంత నీచమైన పని ఇంకొకటి ఉందా? ఎవరి మెప్పు కోసం అలా ఇక్కడి రైతుల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా నాణ్యత లేని పనులు చేశారని, దీనిపై పూర్తి విచారణ కమిటీ వేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు : మంత్రి ఫరూక్**

వెలుగోడు నుండి నంద్యాలకు ప్రతి రోజూ నీరు వస్తుందని, నంద్యాలకు సుమారుగా 45 లక్షల మిలియన్ గ్యాలెన్ల నీరు అవసరం ఉంటుందని, అందు కోసం ప్రయత్నాలు చేస్తామని మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాల, ఆదోని, కర్నూలు ప్రాంతాల్లో సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటు గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాగు నీటికి ఇబ్బంది లేకుండా వెలుగోడు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీరు అందచేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**పలు అంశాలపై మంత్రి భరత్ ఆరా..**

పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో ఏ మేరకు పంటలను సాగుచేశారు, ఎంత మేరకు పంట ఉత్పత్తి జరిగింది, వర్ష శాతం ఎంత ? తదితర వివరాలను మండలాల వారీగా పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను అదేశించారు. తదనుగుణంగా వ్యవసాయ పరంగా ఎలాంటి మెరుగైన చర్యలు తీసుకోవాలో వీలవుతుందని తెలిపారు. మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో డయేరియా బాధితుల గురించి మంత్రి ఆరా తీశారు. సమావేశంలో కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా, నంద్యాలకలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యేలు గౌరు చరిత, జయనాగేశ్వర రెడ్డి, కె.ఈ.శ్యామ్ బాబు, బొగ్గుల దస్తగిరి, పార్థసారథి, విరూపాక్షి, గిత్త జయసూర్య, నంద్యాల జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఇఓ నాసర రెడ్డి, డిప్యూటీ సిఇఓ వెంకట సుబ్బారెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరయిన ప్రజాప్రతినిధులు, అధికారులు

# శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట నిఘా

**- బాధ్యతలు స్వీకరించిన కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్**
**- ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు**
**- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం**
**- డిఐజిని మర్యాదపూర్వకంగా కలిసిన... ఎస్‌పిలు, అడిషనల్ ఎస్‌పిలు**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయంలో కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఎఆర్ పోలీసు సిబ్బందిచే డిఐజి గౌరవ వందనం స్వీకరించారు. పురోహితులు డిఐజికి ఆశీస్సులు అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కర్నూలు రేంజ్ డిఐజి గా రాయలసీమకు రావడం ఇదే మొదటిసారి అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ నిర్వహణకు కర్నూలు రేంజ్ పరిధిలోని 4 (కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య) జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఒక టీమ్ వర్క్‌గా పని చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఐజి ప్రవీణ్

**కోయ ప్రవీణ్ గురించి:** 2009 ఐపిఎస్ బ్యాచ్ కు చెందిన ఆయన కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్‌ను 2004 లో పూర్తి చేశారు. 2009 లో సివిల్స్ రాసి ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లా, పోలవరం ఆయన స్వగ్రామం. ఎఎస్‌పిగా....అసాల్ట్ కమాండర్ (గ్రేహౌండ్స్), ఖాజీపేట , పార్వతీపురం, వరంగల్ , విజయనగరం ఒఎస్‌డిగా పని చేశారు. ఎస్‌పిగా విశాఖపట్నం రూరల్, డిసిపి లా అండ్ ఆర్డర్ విజయవాడ సిటి, సీపోర్టు డైరెక్టర్ కాకినాడ, ప్రకాశం జిల్లా, గుంతకల్ రైల్వే , పోలీసు ట్రాన్స్ పోర్టు ఆర్గనైజేషన్, 16 బెటాలియన్ కమాండెంట్ విశాఖ పట్నం , ఆక్టోపస్, పోలీసు ట్రాన్స్ ఆర్గనైజేషన్‌లలో ఎస్‌పిగా పని చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర సాధారణ బదీలలో భాగంగా గ్రేహౌండ్స్‌లో డిఐజి గా పని చేస్తూ బదిలీ పై కర్నూలు రేంజ్ డిఐజిగా వచ్చారు. కర్నూలు రేంజ్ డిఐజిని కర్నూలు జిల్లా ఎస్పి జి. బిందుమాధవ్, నంద్యాల జిల్లా ఎస్పి అధిరాజ్ సింగ్ రాణా, కడప జిల్లా ఎస్పి వి.హర్ష వర్ధన్ రాజు, అన్నమయ్య జిల్లా ఎస్పి విద్యా సాగర్ నాయుడు, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు మర్యాదపూర్వకంగా కలిశారు.



డిఐజికి మొక్క అందజేస్తున్న ఎస్పీ

# పోస్టింగులకు ప్రదక్షిణలు

**- తహశీల్దారులను రిలీవ్ చేస్తూ సిసిఎల్ఎ ఉత్తర్వులు**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

రెవెన్యూ శాఖలో మండలాల తహశీల్దారుల పోస్టులకు పోస్టింగ్ వేయించుకునేందుకు అధికార పార్టీ నేతలు చుట్టూ రెవెన్యూ అధికారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు కావలసిన మండలాల పోస్టింగ్ కోసం ఇప్పటికే సంబంధిత నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కీలక మండలాల పోస్టింగులకు మాత్రం పెద్ద ఎత్తున నోట్ల కట్టలు ముట్ట చెప్పేందుకు కూడా కొంతమంది రెవెన్యూ అధికారులు వెనకడుగు వేయడం లేదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి పనిచేస్తున్న మండలాల తహశీల్దారులు అనంతపురం, చిత్తూరు, కడప, జిల్లాలకు దాదాపుగా 60 మంది పైగానే తహశీల్దార్ క్యాడర్ అధికారులు బదిలీ అయి వెళ్లారు. ఇప్పుడు ఎన్నికలు ముగిశాక అధికారంలోకి ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులు కావడంతో ఇప్పుడు సొంత జిల్లాలకు రెవెన్యూ శాఖలో పనిచేసే తాహశీల్దార్లను బదిలీ చేసేందుకు శుక్రవారం సిసిఎల్ఎ సొంత జిల్లాలకు రిలీవ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు ఆయా జిల్లాలకు చెందిన తహశీల్దార్లను సొంత జిల్లాలకు పంపి వెంటనే రిలీవ్ చేయాలని సిసిఎల్ఎ ఉత్తర్వులను జారీ చేశారు. కర్నూలు రూరల్, ఓర్వకలు, కల్లూరు, వెల్దుర్తి, కోడుమూరు, గూడూరు,ఎమ్మిగనూరు, ఆదోని పత్తికొండ తదితర మండలాలకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. ఈ మండలాల పోస్టింగ్ కోసం లక్షల్లో ముట్ట చెప్పేందుకు కూడా కొంతమంది రెవెన్యూ అధికారులు వెనుకాడడం లేదు. అలాంటి మండలాల కోసం పోస్టింగులు ఇచ్చేందుకు ప్రజాప్రతినిధులు కూడా తమ అనుకూలమైన వారిని ఇప్పటికే సిఫార్సు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ప్రజా ప్రతినిధులు కూడా సిఫార్సు లేఖలను జిల్లా కలెక్టరుకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇతర జిల్లాలకు బదిలీ వెళ్లిన తహశీల్దార్లు జిల్లాకు రాగానే వెంటనే వారికి మండలాలను కేటాయిస్తూ రెండు మూడు రోజుల్లోగా ఉత్తర్వులు కలెక్టర్ విడుదల చేయనున్నారు.

# తుంగభద్రకు పోటెత్తిన వరద

**- 1,08,556 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**
**- 65 టిఎంసిలకు చేరిన నీటి నిల్వ**

**ప్రజాశక్తి - హోళగుంద**

కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, ధవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు వరద పోటెత్తింది. ప్రస్తుతం రోజుకు 1,08,556 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. గతవారం రోజులుగా రోజుకు 20 వేల నుంచి 30 వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రస్తుతం తుఫాను ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తుండడంతో రోజుకు 1,08,556 క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 65 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఈ రెండు, మూడురోజుల్లో రుతుపవనాల కారణంగా మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. గతేడాది జులై నెలలో 11,425 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండేది. ఈ ఏడాది జులైలో 1,08,556 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో మొదలు కావడంతో త్వరలో డ్యామ్‌లోకి పూర్తిస్థాయి నీటిమట్టం చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. గత రెండు రోజుల క్రితం ఎల్ఎల్‌సికి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే మరో వారం రోజుల్లో తుంగభద్ర డ్యామ్‌కు గరిష్ట స్థాయి నీటిమట్టం 105 టిఎంసిలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు బోర్డ్ అధికారులు పేర్కొంటున్నారు.



## ఉర్దూ వర్సిటీ విసి బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**



డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇంచార్జి విసిగా ప్రొఫెసర్ పిఎస్. షావలిఖాన్ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రస్తుతం కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో బాటని విభాగం అధిపతిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన పై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను విజయవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు, ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. జహనరా, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపి బస్తిపాటి నాగరాజు

## కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

**-కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు**
**- టౌన్ మోడల్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కర్నూలు ఎంపి బస్తి పాటి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సి.సుంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్నూల్ ఎంపీ , ఆర్ఐఓ గురువయ్యశెట్టి పాల్గొని మాట్లాడారు. ఇదే కళాశాలలో తాను ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసానని ఎంపిచెప్పారు. కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీ నిధులను అవసరమైతే కళాశాల అభివృద్ధికి ఖర్చు చేస్తానని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఎంపీ తో పాటు ఆర్ఐఓ, ప్రిన్సిపల్ అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించి టిడ్కో గృహాలు ఇస్తాం

**రాష్ట్ర మంత్రి టి.జి భరత్**
**పేదలకు నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం**
**జగన్నాథగట్టుపై రూ 1.38 కోట్లతో మహిళా మార్ట్‌కు శంకుస్థాపన**

**ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు నిర్మించిన టిడ్కో ఇళ్ల అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి పేదలకు అందజేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు. పేదలకు నివాసం కల్పించాలనే ఉద్దేశంతోనే గతంలో టిడిపి ప్రభుత్వం టిడ్కో గృహాలను ఏర్పాటు చేయడం చేసిందన్నారు. శుక్రవారం నగర శివార్లలోని జగన్నాథ గట్టు పై కర్నూలు నగరపాలక సంస్థ పిఎంఎవై (అర్బన్) టిడ్కో కాలనీలో రూ 1.38 కోట్లతో నిర్మించనున్న మహిళా మార్ట్ నిర్మాణానికి మంత్రి టిజి. భరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు నివాసాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో గృహ నిర్మాణాలు చేపట్టిందన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం మిగిలిన నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. కేవలం చంద్రబాబు నాయుడుకు మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వం రంగులు వేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. టిడ్కో గహాల కోసం లబ్ధిదారులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారన్నారు. చివరి దశలో ఉన్న ఈ గృహాలను త్వరలో అన్ని మౌలిక వసతులతో పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇంటింటి పర్యటన చేపట్టినపుడు చాలామంది లబ్ధిదారులు టిడ్కో గృహాల విషయంలో చాలా సమస్యలు తనకు తెలిపారన్నారు. వీటన్నింటిని తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. మహిళా మార్ట్ ద్వారా టిడ్కో నివాసితులకు రీజనబుల్ ధరలకే సరుకులు లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు నగరానికి తలమానికంలా ఈ గహాలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రిదే అని అన్నారు. ముఖ్యమంత్రి మహిళల పక్షపాతి అని ఈరోజు మహిళల కొరకు మార్టులను ఏర్పాటు చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ఈ గృహాలలో ప్రస్తుతం 50 కుటుంబాలు నివాసం ఉన్నాయని. వీరికి మౌలిక వసతులు కూడా కల్పించామని, గృహాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, ప్రస్తుతం నీటి సౌకర్యాలు కూడా కల్పించామన్నారు. నివాసితుల కొరకు త్వరలో మహిళా మార్ట్ ను కూడా ఏర్పాటు చేయబోతున్నామని, అందుకుగాను ఈరోజు శంకుస్థాపన కార్యక్రమం కూడా మంత్రి చేతుల మీదుగా చేశామన్నారు. పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం ఈ గహాలకు అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసి లబ్ధిదారులకు త్వరలో అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. మన ప్రభుత్వం మహిళా పక్షపాతి అని ఇందుకు ఉదాహరణ ఓర్వకల్లులోని మహిళలే అని ఎమ్మెల్యే అన్నారు. ఓర్వకల్లులోని మహిళా గ్రూపు జిల్లాలో, రాష్ట్రాలలోనే కాకుండా విదేశాల్లో కూడా గుర్తింపు తెచ్చారని ఎమ్మెల్యే అన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం ఈ గహాలను సర్వ సుందరంగా తీర్చిదిద్ది మౌలిక వసతులను త్వరలో కల్పించి లబ్ధిదారులకు ఇవ్వనున్నారని అన్నారు.అంతకుముందు మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు టిడ్కో గహాలను పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఏపీ టిడ్కో ఎస్ఇ రాజశేఖర్, డిఇ లు హరికృష్ణ, రవికుమార్ గుప్త, పవన్ కుమార్, ఎఇ లు కౌశియా, వి.నాయక్, మహిళా మండలి అధ్యక్షురాలు ముంతాజ్, గౌసియాలు పాల్గొన్నారు.



మహిళా మార్ట్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి టిజి.భరత్ , ఎంపీ, ఎమ్మెల్యేలు

## కుల అహంకార దాడులపై దృష్టి పెట్టండి : కెవిపిఎస్

**ఆదోని, ఎమ్మిగనూరులలో దాడి చేసిన వారిని అరెస్టు చేయండి**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :** జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న కుల దురహంకారపు దాడుల పట్ల జిల్లా ఎస్‌పి, కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆదోని, ఎమ్మిగనూరు మండలాలలో మొహర్రం సందర్భంగా దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో రోజు రోజుకు కుల అహంకార దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని నియంత్రించడంలో పోలీసులు విఫలమవుతున్నారన్నారు. ఆధిపత్య అహానికి తోడు రాజకీయ జోక్యం పెరగడంతో పోలీసులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మొహర్రం వస్తుందంటేనే గ్రామాలలో కుల అహంకార జోక్యం ఉంటుందన్న విషయం తెలిసి కూడా వాటిని ముందస్తు నివారించడంలో ఎలాంటి ప్రయత్నం ఉండడం లేదన్నారు. మోహరం సందర్భంగా అలాయి దగ్గర దళితుడి డప్పు మోగందే కాలు కదిపే పరిస్థితి లేనప్పటికీ, దళితులను అలాయికి దూరంగానే ఉంచుతూ వస్తున్నారన్నారు. ఆదోని పట్టణంలో వసంతనగర్ లో డప్పు కళాకారుడు లక్ష్మన్నపై దాడి మరవకముందే, నిన్న మొహర్రం సందర్భంగా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ గ్రామంలో అలాయి దగ్గర దళితులు సావుసోని ఆడరాదు అంటూ మూకుమ్మడి దాడి చేశారన్నారు. ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామంలో దళితుడైన రంగప్పను మాతోపాటు నువ్వు ఆడతావా అంటూ కులం పేరుతో దూషిస్తూ బయటకు గెంటారన్నారు. మా నాన్నను ఎందుకు అవమానించారు అని అడగడానికి వెళ్లిన నాగరాజును, నాగమ్మను కులం పేరుతో దూషించి దాడి చేస్తే నెత్తి పగిలి కుట్లు పడ్డాయన్నారు. దళితులపై దాడి చేసిన వెంకటేష్, గణేష్, భీమేష్, ఉరుకుందులను ఇలాంటి అహంకార పూరిత దాడులు జరగకుండా వెంటనే అరెస్టు చేయాలన్నారు. వెల్దుర్తి మండలం, రత్న పల్లె గ్రామంలో దళిత మహిళపై దాడి జరిగి నెల రోజులు పూర్తయిన ఇప్పటికీ కనీసం కేసు కూడా నమోదు చేయలేదంటే.. ఆధిపత్య అహంకారానికి పోలీసు వ్యవస్థ ఎలా అనిగిమనిగి పనిచేస్తుందో అర్థమవుతోందన్నారు. జిల్లాకు వచ్చిన నూతన ఎస్‌పి, కలెక్టర్ లైన దళితులపై జరుగుతున్న కుల అహంకార దాడులను నియంత్రించాలని, లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



డాక్టర్ శంకర్ శర్మను సన్మానిస్తున్న భాష్యం స్కూలు ప్రిన్సిపల్ రాంప్రసాద్

## మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకూడదు

**భాష్యం పాఠశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో డాక్టర్ శంకర్ శర్మ**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

విద్యార్థులు కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకుండా దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. కర్నూలు నగరంలోని భాష్యం పాఠశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తల్లిదండ్రులు విద్యార్థులను మార్కులు, ర్యాంకులకే పరిమితం చేసి చూస్తున్నారని అన్నారు. అలా కాకుండా వారిని మంచి పౌరులుగా ఎదిగేలా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ఆయా రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను పిల్లలపై రుద్దకుండా తమ పిల్లల్లో ఉన్న అభిరుచులకు అనుగుణంగా చదివించాలని కోరారు. విద్యార్థులు చిన్నతనం నుండే కష్టపడే మనస్తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. సెల్ఫోన్ కేవలం తమకు ఉపయోగపడే అంశాలకు మాత్రమే వినియోగించాలని, అనవసర విషయాలకు వినియోగించి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతి విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. గడిచిన సమయం తిరిగి రాదన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని చెప్పారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల వంటి ఇతర రంగాలలో కూడా రాణించాలన్నారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి జీవితంలో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని డాక్టర్ శంకర్ శర్మ కోరారు. భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-పత్తికొండ**

పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలోని దేవనకొండ అప్డేట్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసులు గత రెండు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. పత్తికొండ డిఎస్‌పి కార్యాలయంలో మానవత దక్పథంతో, తోటి పోలీసు కుటుంబాలతో సేకరించిన రూ. 1,26,000 పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డిహోంగార్డ్ కుటుంబానికి అందజేశారు. ఆ కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మారుతి, రవికుమార్, శ్రీరాములు, లింగన్న, జయరాం, కే శ్రీనురాములు, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

**- ఆర్‌డిఒ రామలక్ష్మి**



ఆలూరు గోదామును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రామలక్ష్మి

**ప్రజాశక్తి - ఆలూరు**

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా సక్రమంగా పంపిణీ చేయాలని పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆలూరు సివిల్ సప్లయి గోదాములో ఉన్న స్టాక్‌ను పరిశీలించి స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన వాటి వ్యత్యాసాన్ని అడిగి తెలుసుకున్నారు. రేషన్ షాపులకు సరఫరా అయ్యే బియ్యంలో ప్రతి బ్యాగ్‌లో 2, 3 కిలోలు తగ్గుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజలు ప్రతినెలా రేషన్ షాపునకు వెళ్లి నిత్యావసరాలు తీసుకోవాలని తెలిపారు. ఇక నుంచి తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒలు పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీలు చేయాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ అధికారులు జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఒహెచ్‌ఆర్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య నివారణ పనులు చేయించాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. తహశీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ బసవన్న గౌడ్, గోదాము ఇన్‌ఛార్జీ రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు

**- టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి**



పరామర్శిస్తున్న రామకృష్ణారెడ్డి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

టిడిపి కార్యకర్త లింగన్నపై దాడి చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని టిడిపి నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని సింగరాజనహల్లిలోని లింగన్న ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గురువారం వైసిపి నాయకుడు డీలర్ రామలింగ చేసిన దాడిలో లింగన్న గాయపడ్డారని చెప్పారు. దాడి చేసిన వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, చట్ట పరంగా వెళ్తామని తెలిపారు. ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి అండగా ఉంటామని లింగన్నకు భరోసా ఇచ్చారు. సింగరాజనహల్లి మాజీ సర్పంచి గోపాల్ రెడ్డి, నాగలాపురం సర్పంచి వీరేష్, హనుమయ్య, నరసింహ, గంగన్న, బసప్ప, నాగరాజు, రామకృష్ణ, వీరేష్ ఉన్నారు.

## అనుమతి లేని ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు

**- ఎంఇఒ రామమూర్తి**



**ప్రజాశక్తి - పెద్దకడబూరు**

మండలంలోని ప్రభుత్వ విద్యాశాఖ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తప్పవని ఎంఇఒ రామమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కొన్ని ప్రయివేట్ పాఠశాలలు విద్యార్థుల అడ్మిషన్లను జరుపుతున్నట్లు ప్రజలు ఫిర్యాదు చేశారని తెలిపారు. అలాగే కొన్ని ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రయివేట్ పాఠశాలలో కచ్చితంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని, లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మొక్కల పెంపకం ఉపయోగకరం

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

మొక్కలు పెంచడం వల్ల మంచి వాతావరణం ఏర్పడి వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపల్ మాధవి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు'లో భాగంగా ప్రధాన కూడలిలో బాలికలతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొక్కలు నాటడం వల్ల కాల్షియం నివారించేందుకు తోడ్పడుతుందన్నారు. విష వాయువు ప్రభావం తొలగాలంటే చెట్లు ఎంతో అవసరమన్నారు. ప్రజలకు 350 మొక్కలు పంపిణీ చేశారు. శ్రీచైతన్య స్కూల్ వైస్ ప్రిన్సిపల్ మహినుద్దీన్, ఉపాధ్యాయులు సోమ గోపాల్, సాయి కృపాకర్, కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న చైతన్య స్కూల్ విద్యార్థులు

# జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటన

**- పలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై పరిశీలన**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

మండలంలో శుక్రవారం జలశక్తి అభియాన్ పథకానికి సంబంధించి ఐఆర్ఎస్ అధికారి చిత్తరంజన్ దాస్, శాస్త్రవేత్త విజయ్ కేతన్‌తో కూడిన కేంద్ర బృందం జెసి నారపురెడ్డి మౌర్య, డ్వామా పీడీ అమర్‌నాథరెడ్డితో కలిసి పర్యటించింది. కేంద్ర ప్రభుత్వ జలశక్తి అభియాన్‌లోని వివిధ స్కీముల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా గాజులదిన్నె ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం, ప్రస్తుత నీటి నిల్వ, నిర్వహణ తదితర వివరాలను ప్రాజెక్టు డిఇ విజయ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రూ.33 వేలతో నిర్మించిన రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ (ఇంకుడు గుంత) నిర్మాణాన్ని, దాని పనితీరు, ప్రయోజనాలను పరిశీలించారు. అక్కడి నుంచి ఐరన్‌బండ గ్రామంలో మహిళలతో సమావేశమై తాగునీటి సరఫరా ఎలా ఉంది, ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. జలజీవన్ బీమా యోజన పథకం ద్వారా ఇంటింటికి ఏర్పాటు చేసిన ఉచిత కుళాయిల్లో నీటి సరఫరాను పరిశీలించారు. నీటిసరఫరాలో ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన చర్యల గురించి ప్రతిపాదనలు పంపాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. చివరగా గోనెగండ్ల గ్రామ పరిధిలోని రైతు పొలంలో ఉపాధి హామీ చట్టం ద్వారా ఏర్పాటు చేసుకున్న నిర్మాణాన్ని పరిశీలించి రైతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. లైజనింగ్ అధికారి ప్రదీప్ కుమార్, ఏపీడీ అల్లిపీరా, ఎంపిడిఒ సోనీబాయి, డిటి లక్ష్మి రాజా, ఆర్ఐ సుబ్బారెడ్డి, జిడిపి ఎఇ చిన్న అలీ, ఎపిఒ మహ్మద్ బాష, ఈసీ ఉస్మాన్ పాల్గొన్నారు.

**తాగునీటి సమస్యపై కేంద్ర బృందం, జెసికి గ్రామస్తుల మొర**

మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో జల జీవన మిషన్‌లో భాగంగా ఇంటింటికి కుళాయిలను జెసి నారపు రెడ్డి మౌర్య, కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు పరిశీలించారు. ఒహెచ్‌ఆర్ ట్యాంకు ఏర్పాటు చేయకుండా గ్రామంలో ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఏమిటని కేంద్ర బృందాన్ని జెసిని ప్రశ్నించారు. గ్రామంలో వారంలో రెండురోజులు కూడా తాగునీటి సరఫరా కావడం లేదని, పనులు పూర్తిగా చేయకుండానే ఉన్న పైపులైన్లను తొలగించారని, గ్రామంలో తాగునీటికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. వెంటనే గ్రామంలో పర్యటించి వీలైనంత త్వరగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇని జెసి ఫోన్‌లో ఆదేశించారు.



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్ నాయుడు

## పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

**- డిఎల్‌పిఒ ప్రకాష్ నాయుడు**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

వర్షాకాలంలో మొదలయ్యే సీజనల్ వ్యాధులను అరికట్టాలంటే పరిసరాలు పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెంచాలని డిఎల్‌పిఒ ప్రకాష్ నాయుడు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం చిప్పగిరి సచివాలయ కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రభుత్వం ఆదేశాల ప్రకారం తహశీల్దార్, ఎంపిడిఒ, ఇఒఆర్‌డి ఒక బృందంగా ఏర్పడి గ్రామాల్లో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో సచివాలయ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతి వీధిలో మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని, అంటువ్యాధులు దరిచేరవని తెలిపారు. అధికారులు వీధుల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటర్ ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేయించాలని తెలిపారు. డ్రెయినేజీ కాలువల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేసే బాధ్యత పంచాయతీ కార్మికులకు అప్పజెప్పాలని సూచించారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా దోమలు ఉంటాయని, వాటి నుంచి రక్షణ కోసం దోమతెరలు వాడాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర, సిసింద్రీ, జయరాం నాయక్, సుధీర్, నరసింహులు, ప్రమీల, రామాంజనేయులు పాల్గొన్నారు.

## 'పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం'

**ప్రజాశక్తి - దేవనకొండ**

గ్రామీణ ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల చుట్టూ పరిశుభ్రత పాటించినప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఆరోగ్యం, పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శి నల్లబోతుల సునీత ఏర్పాటు చేసిన సమావేశానికి సర్పంచి షేకమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా తహశీల్దార్ హాజరయి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వారివారి ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో పర్యటించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, అదనంగా ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం, మస్తాన్ తాత ముఖద్వారం దగ్గర పారుతున్న నీటిని డ్రెయినేజీ ద్వారా గ్రామం బయటకు వెళ్లేలా చూడాలని, కాలనీల్లో సిసి రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీ కాలువల ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా కాలువ పనులు త్వరగా చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తహశీల్దార్ తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత పాటించాలని సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. విఆర్ఒ ఆనంద్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సలాం, సర్వేయర్ షఫీవుల్లా, గ్రామ పెద్దలు బాబు, చాంద్ బాషా, మద్దిలేటి, శ్రీను పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి

**ఆలూరు :** గ్రామంలో ప్రజలు ఇంటి ఆవరణం, ఇంట్లో, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహశీల్దార్ చంద్రశేఖర్ ప్రజలకు, అధికారులకు సూచించారు. ఫ్రైడే-డ్రైడేలో భాగంగా మండలంలోని కమ్మరచేడు గ్రామంలో తాగునీటి సంపు, ఒహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. డ్రెయినేజీ, అంగన్వాడీ, పాఠశాలలు, పిహెచ్‌సిని పరిశీలించి, వ్యాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, అధికారులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఆర్ఐ బసవన్న గౌడ్, పంచాయతీ కార్యదర్శి జిలాన్, విఆర్ఒ సుధీర్ పాల్గొన్నారు.



కౌతాళంలో బ్లీచింగ్ పౌడర్, సున్నం వేయిస్తున్న ఎంపిడిఒ

**కౌతాళం :** గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఎంపిడిఒ రఘునాథ్ గుప్త పేర్కొన్నారు. బంటకుంట, సులేకేరి గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్, సున్నం వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాగునీటి ట్యాంకుల వద్ద, వీధుల్లో, డ్రెయినేజీల వద్ద అపరిశుభ్రంగా లేకుండా చూసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాపించి, వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు.

## టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం

**- తెలుగు రైతు కార్యనిర్వాహక అధ్యక్షులు వైకుంఠం నిరంజన్ ప్రసాద్**



**ప్రజాశక్తి - చిప్పగిరి**

ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందని, ఎవరూ సందేహ పడనవసరం లేదని తెలుగు రైతు కార్యనిర్వాహక అధ్యక్షులు వైకుంఠం నిరంజన్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన చిప్పగిరిలో మాట్లాడారు. గత టిడిపి పరిపాలనలో జరిగిన పొరపాట్లకు తావివ్వకుండా ఈ దఫా ప్రతిదీ ఒక దూర దృష్టి ఆలోచనతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు ఢోకా లేకుండా చంద్రబాబు పాలన ఉంటుందన్నారు. ఆయనపై నమ్మకంతోనే ప్రజలందరూ 164 సీట్లతో ఎన్నడూ లేని విధంగా అగ్రస్థానంలో నిలబెట్టారన్నారు. ప్రజల ఆశలను ఏమాత్రం వమ్ము చేయకుండా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు ప్రాధాన్యత ఇచ్చి అమలు చేస్తారని తెలిపారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో ఏ ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని చెప్పారు. ఇది గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామాలు అభివద్ధి చెందితేనే రాష్ట్రం అభివద్ధి చెందుతుందని పంచాయతీలకు అధిక నిధులను మంజూరు చేస్తున్నారని తెలిపారు. రైతులకు చెప్పినట్టుగానే త్వరలోనే పెంచిన పంట పెట్టుబడి నిధులను అందజేస్తారన్నారు. పథకాలన్నీ పారదర్శకంగా నిరుపేదలకు అందుతాయని, ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని తెలిపారు.





# టిడిపి తాటాకు చప్పళ్లకు భయపడొద్దు

**- సిఐడి దర్యాప్తునకు సిద్ధం**
**- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

టిడిపి నాయకుల దాడులను ప్రతిఘటిస్తామని, వారి తాటాకు చప్పుళ్లకు వైసిపి శ్రేణులు భయపడవద్దని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో వైసిపి నాయకులు వై.సీతారామిరెడ్డి, మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రాజకీయాలకు అతీతంగా అందరికీ మంచి చేశామని తెలిపారు. దానికి బదులుగా చంద్రబాబు పాలనలో వైసిపి శ్రేణులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. మనకు ప్రతిపక్షం కొత్తేమీ కాదని, తాను, తన కుటుంబ సభ్యులు ఉన్నంత వరకు ఎవరూ భయపడాల్సిన పని లేదని తెలిపారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో ఎక్కడా ఉద్దేశపూర్వకంగా టిడిపి నాయకులపై దాడులు చేయలేదని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లను లక్ష్యంగా చేసుకుని తొలగించాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తానున్నంత వరకు రెగ్యులర్ రేషన్ డీలర్లు ఎవరూ అధైర్య పడొద్దని, ఎవరిపైనా దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి మాలపల్లి గురురాజారావు స్వామిని వైసిపి అడ్వకేట్‌గా నియమించినట్లు తెలిపారు. కోసిగిలో ముత్తురెడ్డి తనపై సిఐడి దర్యాప్తు చేపట్టాలని కోరారని, దానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ముత్తురెడ్డి ఎప్పుడు విచారణ చేపట్టినా పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు. అందరూ ధైర్యంగా జగన్మోహన్ రెడ్డి వెంటే ఉన్నారని చెప్పారు. మరో నాలుగేళ్ల తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్ రెడ్డి, 5వ సారీ తాను ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

## 23న చేపల వేలం పాట

**- మత్స్య శాఖ సహాయ పర్యవేక్షకులు నాగరాజు**

**ప్రజాశక్తి - కోసిగి**

కోసిగి గ్రామ సమీపంలో ఉన్న పులికనుమ రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు ఈనెల 23న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ పర్యవేక్షకులు నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మత్స్య సంపదను జులై 1, 2024 నుంచి జున్ 30, 2025 వరకు వేలం ద్వారా రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు లీజుకు ఇస్తామన్నారు. ఈ బహిరంగ వేలం పాటలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు మండల నాయకులు, అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్ కార్డుతో పాటు రూ.10 వేలు డిపాజిట్ చేయాలని అన్నారు. అధికంగా పాడిన వారికే లీజుకు ఇస్తామన్నారు. వేలం పాటలో వెంటనే డబ్బులు చెల్లించాలన్నారు. వేలం పాట దారునికి మత్స్య సంపదపై మాత్రమే అధికారం ఉంటుందని, నీటిపై ఎలాంటి అధికారమూ ఉండదని తెలిపారు. చేపలు పట్టే సమయంలో తూముల నుంచి కానీ, గండ్లు పెట్టి నీరు తొలగించి చేపలు పట్టరాదన్నారు. వేలంపాటలో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువగా వేలం వస్తే రద్దు చేస్తామన్నారు.

## నేడు కల్లుబావి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

పట్టణంలోని 132 కెవి కల్లుబావి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎడి పురుషోత్తం, ఎఇ నాగభూషణం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ అప్పుడప్పుడు వస్తూ పోతుంటుందని తెలిపారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌పై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడిన లేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు కూడా ప్రజలు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ తీగలు కింద పడినట్లు కనిపిస్తే విద్యుత్ అధికారి సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులు పంట పొలాల్లో బావులు, బోరుల వద్ద విద్యుత్ పెట్టేముందు స్టార్టర్ బాక్స్‌లను, ఫ్యూజ్ బాక్స్‌లను తడి చేతులతో ముట్ట కూడదని సూచించారు.

## విద్యుత్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఆదోని రూరల్ విద్యుత్ ఎఇ చెన్నయ్య**

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**



వర్షాకాలం కావడంతో విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌పై అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఎఇ చెన్నయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. వర్షాకాలం కావడంతో ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా లేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు కూడా ప్రజలు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు కింద పడినట్లు కనిపిస్తే తన ఫోన్ 94408 13384 నెంబరుకు ఫోన్ చేస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు పంట పొలాల్లో బావులు, బోరుల వద్ద విద్యుత్ పెట్టేముందు స్టార్టర్ బాక్స్‌లను, ఫ్యూజ్ బాక్స్‌లను తడి చేతులతో ముట్ట కూడదని సూచించారు.

## కౌలు రైతులను ఆదుకోవాలి

**- రైతుసంఘం, వ్యకాస నాయకులు**

**ప్రజాశక్తి - పెద్దకడబూరు**

గతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం, వ్యకాస నాయకులు కోరారు. శుక్రవారం రైతుసంఘం ఆధ్వర్యంలో కల్లుకుంట సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు తిక్కన్న, వ్యకాస నాయకులు శ్రీనివాసులు మాట్లాడారు. గతేడాది వర్షాభావ పరిస్థితులతో గ్రామంలో దాదాపు 1000 మంది కౌలు రైతులు పంటలు నష్టపోయారని, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయమూ అందలేదని తెలిపారు. కౌలుపత్రం కోసం దరఖాస్తు చేసుకున్న కౌలుదారులందరికీ గుర్తింపు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. రైతుసంఘం నాయకులు బుడ్డన్న, నాగరాజు పాల్గొన్నారు.

## నమాజ్ సమయంలో దాడి

**ప్రజాశక్తి - కోసిగి**

మండలంలోని సాతనూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ చేస్తున్న సమయంలో గ్రామానికి చెందిన నజీర్, నవాజ్‌పై అదే గ్రామానికి చెందిన ముతవల్లి, అతని కుమారులు దాడి చేశారు. బాధితులు, గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన ముతవల్లీ ముల్లా ఖాసీం గతంలో గ్రామంలో ఉన్న వక్ఫ్ బోర్డు భూమిని తన ఆధీనంలో పెట్టుకుని సాగు చేసేవారు. ఈ ఏడాది అధికారికంగా అదే గ్రామానికి చెందిన గ్రామస్తులు జిల్లా వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో వేలం పాటలో పాల్గొని గ్రామానికి చెందిన 20 మంది రైతులు సాగు చేసుకోవడానికి లీజుకు తీసుకున్నారు. ఈ ఏడాది భూమి తనకురాలేదనే కక్షతో ముత్తవల్లి, అతని కుమారులు ఖాజా, రైమత్ వలీ, జిలాన్, అబ్దుల్ దాడి చేశారు. వక్ఫ్ బోర్డు పొలం వేలంలో దక్కించుకున్నందుకు పథకం ప్రకారం నజీర్, నమాజ్‌పై కర్రలతో దాడి చేశారు. చంపుతామంటూ గొడ్డలి తీసుకొచ్చారని బాధితులు వాపోయారు. క్షతగాత్రులు ఆదోనీ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

## గుండెపోటుతో కెవిపిఎస్ నాయకుడు మృతి

**ప్రజాశక్తి - కోసిగి**

గుండెపోటుతో కెవిపిఎస్ నాయకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దుద్ది గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కెవిపిఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, కెవిపిఎస్ నాయకులు ముక్కరన్నలు మృతి చెందిన కెవిపిఎస్ నాయకుడు రామన్న మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రామన్న దుద్ది గ్రామంలో కాటికాపర్ల సంఘం నాయకులుగా చురుగ్గా పనిచేసేవారని తెలిపారు. రామన్న కుటుంబ సభ్యులకు కెవిపిఎస్ తరపున రూ.2 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## వీధిలైట్ల సమస్య పరిష్కారం

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోనిలోని విజయనగర్ కాలనీలో నెలకొన్న వీధిలైట్ల సమస్యను పరిష్కరించినట్లు టిడిపి నాయకులు అమర్ ప్రకాష్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. రెండు మంచినీటి వాటర్ ట్యాంకులతో నీటి సరఫరా చేశామన్నారు. 2, 3 రోజులకోసారి రెండు వాటర్ ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. కాలనీవాసులకు నీటి సమస్యకు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీధిలైట్లు వెలగక చీకట్లో మగ్గి ఉండేవారని, స్థానికుల సమాచారం మేరకు అక్కడికెళ్లి పరిశీలించి మున్సిపల్ అధికారుల సహాయంతో వీధిలైట్లు వేయించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.

## 28 వరకు సభ్యత్వ నమోదు

**- జనసేన పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రేణువర్మ, తాహెర్‌వలీ**

**ప్రజాశక్తి - ఆదోని**

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఈనెల 18 నుంచి 28 వరకు కొనసాగుతుందని జనసేన పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రేణు వర్మ, తాహెర్ వలీ తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని జనసేన పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. గతంలో సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదంలో మరణించినా, గాయపడినా వారికి జనసేన పార్టీ నుంచి చెక్కులు వచ్చాయన్నారు. త్వరలో నాగబాబు చేతుల మీదుగా కుటుంబాలకు అందజేస్తారన్నారు. జనసేన నాయకులు ప్రకాష్, ఇస్వీ వీరేష్, కడితోట శాంత, జాలిమంచి వీరేష్, దాసప్ప, ఆటో శీను, జెసిబి వెంకటేష్, రాయ నగర్ శ్యామ్ పాల్గొన్నారు.

## భవిత కేంద్రం పరిశీలన

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోనిలోని తిరుమల నగర్ వద్ద ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రాన్ని రాష్ట్ర ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారి కల్పన శైల శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో రికార్డులను తనిఖీ చేసి, అమలవుతున్న పథకాలు, విద్యార్థుల ఇబ్బందులపై ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఎంఇఒ శ్రీనివాసులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ సురేష్ ఉన్నారు.

## శ్రీమఠంలోని అన్నదానానికి విరాళం

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో కొనసాగుతున్న నిత్యాన్నదానానికి భక్తుల నుంచి రూ.లక్ష విరాళం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన బెంగళూరుకు చెందిన గంగాధర్ రెడ్డి స్వామి వారి దర్శనం అనంతరం రూ.లక్ష విరాళంగా అందించారని తెలిపారు.

## ఆదోనిలో ఆటోనగర్ ఏర్పాటు చేయండి

**- మంత్రికి ఎమ్మెల్యే వినతి**

**ప్రజాశక్తి - ఆదోని**



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే


పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు సహకారం అందించాలని పరిశ్రమ శాఖ మంత్రి టిజి.భరత్‌ను కోరామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. శుక్రవారం కర్నూలులోని జిల్లా పరిషత్ సమావేశం అనంతరం వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడారు. పట్టణంలో ఆటోనగర్ ఆవశ్యకత గురించి వివరించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. పట్టణంలో సుమారు 1000 మంది వాహనాలను మరమ్మతులు చేసే కార్మికులు ఉన్నారని, వారి తక్షణ అవసరం కోసం ప్రభుత్వం పెద్దపీట చేయాలని కోరారు. ఆటోనగర్ ఏర్పాటుకు పట్టణంలో స్థల సేకరణ చేసి, వారి సంక్షేమానికి పాటుపడాలని కోరామన్నారు.

**రణమండల కొండ మార్గంలో రోడ్డు నిర్మించాలి**

ఆదోని శివారు కొండలో వెలిసిన శ్రీరణమండల ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం కొండ మార్గంలో రోడ్డు నిర్మించాలని కోరినట్లు ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. టూరిజం శాఖ ద్వారా నిధులు కేటాయించాలని, శ్రావణమాస ఉత్సవాల్లో వసతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు. రైతులు గ్రామీణ ప్రాంతాల నుంచి దిగుబడులను, సరుకులను మార్కెట్ యార్డుకు తరలించే గ్రామాల పొలాల అంతర్గతం లింక్ రోడ్లను గ్రావెల్స్ రోడ్లలో మరమ్మతులు చేపట్టాలని కోరినట్లు చెప్పారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

**ప్రజాశక్తి - ఆదోని**



బాధితుని పరామర్శిస్తున్న తిక్కప్ప

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మాల నాగరాజుపై దాడి చేసిన కుల అహంకారులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజును శుక్రవారం బి.తిక్కప్ప, కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు దావీదు, తాయన్న పరామర్శించి విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మొహర్రం పండగ సందర్భంగా నాగరాజు తండ్రి రంగప్పను ఆధిపత్య వర్గాలు కులం పేరుతో దూషించి దాడి చేశాయని తెలిపారు. 'మా నాన్నను ఎందుకు కులం పేరుతో దూషించి దాడి చేశావ'ని అడుగుతున్న సందర్భంలో 'మాల నా కొడకా నువ్వు కూడా నన్ను ప్రశ్నిస్తావా' అంటూ గొల్ల వెంకటేష్, కురువ గణేష్, కురువ భీమేష్, బోయ ఉరుకుందులు మాల నాగరాజుపై దాడి చేసి, తల పగలగొట్టారని చెప్పారు. దాడిపై ఇస్వీ పోలీసు స్టేషన్లో సమాచారం ఇచ్చినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.